

చిట్టి పొట్టకు రక్ష
చిన్నారుల కడుపులో పెరిగే నులి పురుగులు అనేక అనర్థాలకు దారి తీస్తాయి. వీటి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.
8లో



దండాలయ్యా.. ఉండ్రాలయ్యా..
బిక్కవోలులో కొలువైన శ్రీలక్ష్మీ గణపతి ఆలయం వద్ద స్వామివారికి భక్తులు శనివారం లక్ష ఉండ్రాళ్లతో నైవేద్యం సమర్పించారు.
8లో

డెల్టాలకు 7,350 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 7,350 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,170, మధ్య డెల్టాకు 1,410, పశ్చిమ డెల్టాకు 3,770 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 5.85 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

పరీక్షలు సమన్వయంతో నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా. చిత్రంలో ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలను సమన్వయంతో నిర్వహించాలని, ఎక్కడా పొరపాట్లకు తావు లేకుండా చూడాలని వివిధ శాఖల అధికారులను కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, వివిధ శాఖల అధికారులతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అమరావతి నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో కలెక్టరేట్ నుంచి కలెక్టర్, ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులనుద్దేశించి మాట్లాడుతూ, ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకూ ఇంటర్మీడియెట్, ఏప్రిల్ 3 నుంచి 18 వరకూ పదో తరగతి పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 60 కేంద్రాల్లో 41,817 మంది ఇంటర్ పరీక్షలు రాయనున్నారని తెలిపారు. అలాగే 136 కేంద్రాల్లో 29,988 మంది పదో తరగతి పరీక్షలు రాస్తారన్నారు. ప్రతి దశలోనూ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. బందోబస్తుపై పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఆయా కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్, ఫొటో స్కానింగ్ కేంద్రాలను పరీక్ష సమయాల్లో మూసివేయాలన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని సూచించారు. విద్యార్థులెవ్వరికీ సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, బ్లూటూత్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకు వచ్చేందుకు అనుమతి లేదన్నారు. ఇన్విజిలేటర్లు, సిబ్బంది తమ సెల్‌ఫోన్లతో పరీక్ష గదుల్లోకి వెళ్లరాదన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ కె.శ్రీధర్‌రెడ్డి, ఆర్‌జేడీ జి.నాగమణి, డీఈఓ కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

నువ్వు విజిలేస్తే..
ఆంధ్రా సోడా బుడ్డీ



సండే స్పెషల్

- పాత గోళీ సోడాలకు కొత్త హంగులు
- అదరగొడుతున్న అమ్మకాలు
- వేసవితో పెరిగిన గిరాకీ
- మార్కెట్‌ను ముంచెత్తిన నయా ట్రెండ్

పిఠాపురం: ఓ సినిమాలో 'నువ్వు విజిలేస్తే.. ఆంధ్రా సోడా బుడ్డీ' అనే పాట ఎంత ట్రెండ్ సృష్టించిందో అందరికీ తెలిసిందే.. అచ్చం అలానే అనేక సంవత్సరాలు గోళీ సోడా ఒక ఊపు ఊపింది.. అది తాగితేనే గాని ఉపశమనం పొందే పరిస్థితి ఉండేది కాదు. కడుపు ఉబ్బరంగా.. పట్టేసినట్టు.. అన్నం అరగలేనట్టు.. తేన్పు రాలేనట్టు ఉన్నా ఒక్క గోళీ సోడా తాగితే వీటన్నింటికీ సమాధానం చెప్పేది. ఇప్పుడా గోళీ సోడా ఖాళీ అయ్యింది. రోజుకో రకం సోడా మెషీన్లు అందుబాటులోకి రావడంతో గోళీ సోడాలు కనుమరుగయ్యాయి. కానీ అదే సోడా కొత్తదనంతో పునర్దర్శనమిచ్చింది. మారుతున్న వ్యాపారానికి అనుగుణంగా రంగులద్దుకుని మార్కెట్‌లో కనిపిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో కిళ్లీ షాపుల్లో మాత్రమే కనిపించే గోళీ సోడాలు కనుమరుగు కాగా, ఇప్పుడు ప్రత్యేక వాహనాల్లో కొత్త రూపంలో దర్శనమిస్తున్నాయి. గతంలో ప్రత్యేకంగా తయారు చేసిన గాజు సీసా తయారీలోనే గోళీ ఉండేది. దానిపై రబ్బరు వాషర్ ఏర్పాటు చేసి సగం వరకూ నీళ్లు పోసి మెషీన్ ద్వారా గ్యాస్ ఎక్కించి, సోడా తయారు చేసేవారు. దీనికి ఒక వ్యక్తి పూర్తి స్థాయిలో కష్టపడాల్సి వచ్చేది. మెషీన్‌పై సోడాలు తయారు చేయడం కొన్ని సమయాల్లో ప్రమాదాలకు దారి తీసేది. రాను రానూ కొత్త రకం యంత్రాలు అందుబాటులోకి రావడంతో సోడాతో పాటు డ్రింక్‌లు సైతం నిమిషాల్లో తయారవుతున్నాయి. గతంలో వచ్చిన యంత్రాలు (సోడా హబ్‌లు) సీసాలతో పని లేకుండా కేవలం గ్లాసులు మాత్రమే ఉపయోగించడం వల్ల ఎటువంటి ప్రమాదాలు లేకపోగా త్వరితగతిన తయారవుతుండడంతో ఎక్కువ మంది వాటిపై మొగ్గు చూపారు. దీంతో అప్పటి వరకూ అందుబాటులో ఉన్న గోళీ సోడా కనుమరుగైంది. గ్రామీణ ప్రాంతాల్లో కీచ్... మంటూ శబ్దాలు వినిపించగానే గోళీ సోడా తాగుతున్నారనుకొనేవారు. ప్రత్యేకంగా తయారు చేసిన బండ్లపై సోడాలు అమ్ముతూ అనేక మంది జీవనం సాగించేవారు. ప్రస్తుతం వారందరూ కనిపించకుండా పోయారు. వారి స్థానంలో కొత్త ట్రెండ్‌లో వచ్చిన గోళీ సోడాలు ఆటోలు, ప్రత్యేక వాహనాల ద్వారా విక్రయిస్తున్నారు.

రంగోళీ సోడా

ప్రస్తుత ప్రపంచంలో పాత వాటికి కొత్త రంగులు వేసి మార్కెట్‌లోకి తీసుకువస్తే అదే నయా ట్రెండ్‌గా మారిపోతోంది. అదే విధంగా గోళీ సోడా వచ్చేసింది. పాత సోడాకు కొత్త రంగులు కలిపి ఆకర్షణీయంగా తయారు చేసి, మార్కెట్‌లోకి తీసుకురావడంతో అందరూ వాటిని ఆస్వాదించడానికి ఉత్సాహపడుతున్నారు.

రండి.. బాబూ రండి..

పూర్వం పది పైసల నుంచి ప్రారంభమైన గోళీ సోడాలు రూ.1 వరకూ అమ్మకాలు జరగగా.. ప్రస్తుతం కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన రంగుల సోడా రూ.20కి విక్రయిస్తున్నారు. అయినప్పటికీ పలువురు ఈ సోడాలను తాగుతున్నారు. ప్రస్తుతం ఎండలు మండుతుండడంతో ఎక్కువ మంది వీటికి ప్రాధాన్యం ఇస్తున్నారు. కాకినాడ నుంచి వస్తున్న సోడా వ్యాపారులు పలు పట్టణాల్లో ప్రత్యేక వాహనాలపై వచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. కూలింగ్ పెట్టి మరీ అమ్ముతుండడంతో అందరూ వీటిని తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు.



కొత్త రూపంలో సోడాలు



కొత్త గోళీ సోడా తాగుతున్న మహిళ

పాతదే అయినా కొత్తగా..



సోడా పాతదే అయినా కొత్తగా ఉందంటున్నారు. సోడా సీసా రూపురేఖలు మారకపోయినా.. వాటిపై స్టిక్కర్లు, వాటిలో రంగులు కొత్తదనాన్ని సృష్టించాయి. అందరూ మారిన ట్రెండ్‌కు అలవాటు పడటం పరిపాటిగా ఉన్న ప్రస్తుత తరుణంలో గోళీ సోడాకు మార్కెట్‌లో మంచి గిరాకీయే వస్తోంది. కాకినాడ నుంచి తెచ్చి పిఠాపురంలో అమ్ముతున్నాం. ప్రస్తుతం వేసవి ప్రారంభమవ్వడంతో విక్రయాలు బాగా పెరిగాయి.

– నెక్కలి శ్రీనివాస్, సోడా వ్యాపారి, కాకినాడ

రోజుకు వెయ్యి సోడాలు



గతంలో రోజుకు వెయ్యి సోడాలు అమ్మేవాడిని. అప్పట్లో రంగుల సోడాలు విక్రయించే వాళ్లం. కానీ వాటిలో తక్కువగా ఎసెన్స్, పంచదార పాకం మాత్రమే వాడేవాళ్లం. వాటిని అందరూ తాగేవారు. అన్నం తిని తప్పకుండా సోడా తాగేవారు. వెంటనే తేన్పు వచ్చేది. ఎటువంటి అనారోగ్యం లేని పానీయంగా సోడా పేరొందింది. మెషీన్‌పై సోడా పట్టడం అంటే ప్రాణాలతో చెలగాటమే. చాలాసార్లు నేనూ ప్రమాదానికి గురయ్యాను.

– ఉంగరాల గణేష్, కిళ్లీ కొట్టు యజమాని, కొత్తపల్లి

ఆ టేస్టే వేరు

గోళీ సోడా ఎప్పుడో తాగాను. మళ్లీ కొత్తది ఇప్పుడు రుచి చూశాను. అప్పటికీ, ఇప్పటికి సోడాలో తేడా కేవలం రంగులు, ఆకర్షణీయంగా ఉండటమే. ఏదైనా పాత దానికి కొత్తదనాన్ని తీసుకురావడంతో చాలా మంది రుచి చూడడానికైనా తాగుతున్నారు. ఇప్పటి జనానికి రంగుల ప్రపంచం కావాలి. అందుకే కొత్త సోడాలకు గిరాకీ పెరిగింది.

– ఎం.సత్తిబాబు, పిఠాపురం

తూర్పు వేదికపై
నవోదయం



- పార్టీ ఏర్పాటుపై తొలిసారి ఇక్కడే వైఎస్ జగన్ ప్రకటన
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: నేటి సంక్షేమ నవోదయానికి పుష్కర కాలం కిందట 'తూర్పు' వేదిక పైనే నాంది పడింది. ప్రజల గళమై.. వారి పక్షాన నిలిచి.. బలమైన ఉద్యమాలు చేసి.. ప్రభుత్వ పాలనను నేడు వారికి చేరువ చేసిన వైఎస్సార్ సీపీ పుట్టుకకు బీజం పడింది ఇక్కడే కావడం విశేషం. పార్టీ ఆవిర్భావం నుంచీ జనహృదయ నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఎంతో చేరువయ్యారు. 2011 మార్చి 12న పార్టీ ఏర్పాటు చేస్తున్న విషయాన్ని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాడు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని జగ్గంపేట వేదికగా ప్రకటించారు. ఆయన చేసిన ఈ ప్రకటన అప్పట్లో పెను సంచలనమే అయ్యింది. పార్టీ జెండా, అజెండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఖరారైనా పార్టీ ఆవిర్భావానికి తొలి అడుగు పడింది మాత్రం మన ఉమ్మడి జిల్లాలోనే.

నాటి అధికార తెలుగుదేశం పార్టీ ఏలుబడిలో దాదాపు అన్ని వర్గాలూ కష్టాలు ఎదుర్కొన్నాయి. కన్నీటి వేదనలు అనుభవించాయి. అటువంటి పీడిత ప్రజల వెన్నంటి నిలిచిన పార్టీగా ఆవిర్భావం నుంచీ వైఎస్సార్ సీపీ వేసుకున్న ముద్ర నేటికీ ఎక్కడా చెక్కుచెదరలేదు. పుష్కర కాల ప్రయాణంలో అనుక్షణం ప్రజల పక్షాన నిలిచి, నాటి అధికార టీడీపీపై పోరాటానికే వైఎస్సార్ సీపీ ప్రాధాన్యం ఇచ్చింది. దీంతో ఆ పార్టీకి 2019 ఎన్నికల్లో ప్రజలు ఎంతో నమ్మకంతో చారిత్రక విజయాన్ని అందించి, పట్టం కట్టారు. గడచిన నాలుగేళ్లలో ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తూ వస్తున్నారు.

'తూర్పు' సెంటిమెంట్‌గా పార్టీ ప్రకటన ఇక్కడ చేయడమే కాదు.. అధికార పగ్గాలు చేపట్టిన తరువాత అనేక ప్రతిష్టాత్మక పథకాలకు ఉమ్మడి జిల్లా నుంచే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుడుతున్నారు. వైఎస్సార్ పీఎంఏవై ఇళ్ల పథకాన్ని పిఠాపురం నియోజకవర్గం కొమరగిరిలో ప్రారంభించారు. పరిపాలనలో విప్లవాత్మకమైనదిగా దేశ వ్యాప్త గుర్తింపు పొందిన గ్రామ సచివాలయ వ్యవస్థకు కరపలో.. మత్స్యకార భరోసాకు ముమ్మిడివరంలో.. 'మన బడి నాడు – నేడు' కింద అభివృద్ధి చేసిన పాఠశాలలను ప్రజలకు అంకితం చేసే కార్యక్రమానికి పి.గన్నవరంలో.. మహిళల భద్రతకు ఉద్దేశించిన 'దిశ'కు రాజానగరంలో.. ఇలా అనేక కార్యక్రమాలను ఆయన ఇక్కడి నుంచే చేపట్టారు. నాడు ప్రతిపక్ష నేతగా ఇచ్చిన మాటకు కట్టుబడి.. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయడంతో పాటు జనరంజక పాలన అందించడం ద్వారా ప్రజల హృదయాల్లో వైఎస్సార్ సీపీ సుస్థిర స్థానం సంపాదించుకుంది. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన మాట కోసం పేదలు, బడుగు బలహీనవర్గాలు, నిమ్న వర్గాల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలనే సంకల్పానికి తన పాలనలో జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్న తీరుపై ప్రజలు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. సంక్షేమ పథకాల నుంచి పార్టీ పదవులు, అధికారిక పదవుల వరకూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా పార్టీపై ప్రజలకు ఒక బలమైన భరోసా ఇచ్చారు.

నేడు ఆవిర్భావ దినోత్సవం

వైఎస్సార్ సీపీ 13వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు), పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపు ఇచ్చారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఎమ్మెల్యేలు, నేతలు పార్టీ పతాకాలను ఆవిష్కరించి, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

కొండ నిండా భక్తులు

- కిక్కిరిసిన రత్నగిరి
- సత్యదేవుని దర్శించిన 50 వేల మంది



రూ.300 వ్రత మండపం వద్ద కిక్కిరిసిన భక్తులు

అన్నవరం: వెల్లువలా తరలివచ్చిన భక్తులతో రత్నగిరి శనివారం కిటకిటలాడింది. శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున రత్నగిరిపై వంద వివాహాలు జరిగాయి. ఇవే ముహూర్తాల్లో ఇతర ప్రాంతాల్లో కూడా అనేక జంటలు ఒక్కటయ్యాయి. ఆ నవదంపతులు, వారి బంధుమిత్రులు కొండకు తరలివచ్చారు. దీనికితోడు శనివారం, ఆదివారం వరుస సెలవులు రావడంతో ఇతర భక్తులు కూడా పెద్ద సంఖ్యలో స్వామివారి వ్రతాలకు, దర్శనానికి వచ్చారు. దీంతో దేవస్థానంలో ఉదయం నుంచీ తీవ్ర రద్దీ ఏర్పడింది. ఆలయ ప్రాంగణం, క్యూలు, వ్రత, విశ్రాంత మండపాలు నవదంపతులు, భక్తులతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు రద్దీ కొనసాగింది. దేవస్థానంలో పార్కింగ్ స్థలాలు, ఘాట్ రోడ్లు పెళ్లి బృందాల కార్లతో నిండిపోయాయి. దీంతో ట్రాఫిక్‌కు పలుమార్లు అంతరాయం కలిగింది. రూ.300 వ్రత మండపం వద్ద వ్రతాలాచరించే భక్తులు సుమారు గంటసేపు వేచి ఉండాల్సి వచ్చింది. సుమారు 50 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారని అధికారులు తెలిపారు. వ్రతాలు 3,500 జరిగాయి. స్వామివారి ఉచిత దర్శనానికి రెండు గంటలు, అంతరాలయ దర్శనానికి గంట సమయం పట్టింది. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.50 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు పేర్కొన్నారు. ఆదివారం కూడా రద్దీ అధికంగా ఉంటుందని చెప్పారు.

ఘనంగా ప్రాకారసేవ

రత్నగిరి వాసుడు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల ప్రాకార సేవ ఘనంగా జరిగింది. ఉదయం పది గంటలకు స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనంపై వేంచేయించి, తూర్పు రాజగోపురం వద్ద ఆలయ ప్రాంగణంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ప్రాకారంలో మూడుసార్లు ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు తిరిగి పూజలు నిర్వహించి ఆలయానికి చేర్చారు.

ఫెన్సింగ్ పోటీలు ప్రారంభం



రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న సుబ్బారాయుడు తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా ఫెన్సింగ్ సంఘం ఆధ్వర్యాన స్థానిక ద్రోణాచార్య బ్యాడ్మింటన్ అకాడమీ ఆవరణలో తొమ్మిదో సీనియర్ స్టేట్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ కాకినాడ జోన్ డిప్యూటీ కమిషనర్ పెద్దాడ సుబ్బారాయుడు పోటీలను ప్రారంభించారు. ఫెన్సింగ్‌లో రాణించి జిల్లాకు మంచి పేరు తేవాలని ఈ సందర్భంగా క్రీడాకారులకు ఆయన సూచించారు. ఈ పోటీల్లో 13 జిల్లాల నుంచి 300 మంది పాల్గొంటున్నారని ఫెన్సింగ్ సంఘ కార్యదర్శి ప్రకాష్ తెలిపారు.

క్లుప్తంగా

ఎవరీ బాబు..!


దీనంగా చూస్తున్న బాలుడు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పాపం ఎవరీ బాబు..! వెచ్చని తల్లి ఒడిలో ఆడులాడుకోవాల్సిన ప్రాయం రోడ్డున పడింది.. అభాగ్యుడిగా మిగిల్చింది.. తల్లిదండ్రులు ఎవరో చెప్పలేని స్థితిలో ఉన్న ఆ బాలుడిని శిశు గృహ సంరక్షిస్తోంది.. శనివారం స్థానికంగా చైల్డ్ లైన్ వెల్ఫేర్ శాఖ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. రెండు నెలల కిందట ఓ మహిళకు రాజమహేంద్రవరంలో రోడ్డుపై ఏడుస్తూ ఓ బాబు (3) కనిపించాడు. దాంతో ఆమె అతనిని తన ఇంటికి తీసుకెళ్లింది. కొద్ది రోజుల తర్వాత ఆ బాలుడిని తిరిగి రోడ్డుపైనే వదిలివేసింది. దీనిని చూసిన స్థానికులు చైల్డ్‌లైన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి అతనిని చేరదీశారు. స్థానికుల నుంచి బాబు వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించారు. ఎటువంటి ఆధారాలు లభించలేదు. దీంతో కాకినాడలోని శిశు గృహకు తరలించి అక్కడ సంరక్షణ కల్పిస్తున్నారు. బాబుకు సంబంధించి తల్లిదండ్రులు, రక్తసంబంధీకులు ఎవరూ రానిపక్షంలో చట్టబద్ధంగా కావాల్సిన వారికి దత్తత ఇస్తామని శ్రీనివాస్ వివరించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ముమ్మిడివరం: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు గేటు వద్ద ఓ నిందితుడు పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. గేదెల్లంక గ్రామానికి చెందిన నిమ్మన మణికంఠపై 2014లో ముమ్మిడివరం పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు విషయంలో కోర్టు వాయిదాకు హాజరు కాకపోవడంతో అరెస్ట్ వారెంట్ జారీ అయ్యింది. మరోవైపు గంజాయి కేసులో ఇటీవల పట్టుబడిన ఓ వ్యక్తికి మణికంఠతో పరిచయం ఉండడంతో పోలీసులు విచారిస్తారని వారం కిందటే అతను గ్రామం నుంచి పరారయ్యాడు. ఎక్కడికి వెళ్లినా పోలీసులు అరెస్టు చేయడం ఖాయమన్న భయంతో శుక్రవారం కోర్టు గేటు వద్దకు వచ్చి తనతో తెచ్చుకున్న పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. దీంతో అతడిని పోలీసులు అమలాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు ఎస్ఐ కె.సురేష్ బాబు కేసు నమోదు చేశారు.

చిట్టి పొట్టకు రక్ష

- 14న నులి పురుగుల నివారణ దినోత్సవం
- 10.58 లక్షల మందికి అల్బెండజోల్
- పంపిణీకి సిద్ధం చేసిన అధికారులు

రాయవరం: ఆరోగ్యమే మహా భాగ్యం అంటుంటారు పెద్దలు. అలాంటి ఆరోగ్యానికి జాగ్రత్తలు తప్పనిసరి. కడుపులో పెరిగిన చినపాటి నులి పురుగులు అనేక అనర్థాలకు దారితీస్తాయి. వీటి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టింది. ఇందులో వైద్య ఆరోగ్య, విద్య, వైఎస్సార్ క్రాంతి పథం, ఇంటర్మీడియేట్, టెక్నికల్ ఎడ్యుకేషన్, సాంఘిక సంక్షేమ శాఖలు భాగస్వాములు అవుతున్నాయి. దీనిలో భాగంగా 14న జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందు వేయనున్నారు. 1–19 ఏళ్ల లోపు వారందరికీ అల్బెండజోల్ మాత్రలు అందిస్తారు. 1–2 ఏళ్ల వయసున్న చిన్నారులకు 200 మి.గ్రా ఆల్బెండజోల్ మాత్రను నీళ్లలో కలిపి ఇవ్వాలి. రెండేళ్ల నుంచి 19 సంవత్సరాల లోపు వారికి 400 మిల్లీగ్రాముల ఒక మాత్రను ఇస్తారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ముగిసిన వెంటనే విద్యార్థులతో మాత్రలు చప్పరించేలా చేస్తారు. ఆ బాధ్యతను ఉపాధ్యాయుల సహకారంతో వైద్య ఆరోగ్య సిబ్బంది చేపట్టనున్నారు. మాత్రలు వేసుకున్న వెంటనే వాంతులు, వికారం వచ్చినా కంగారు పడాల్సిన అవసరం లేదని, తాగునీటిని అందుబాటులో ఉంచుకోవాలని పీహెచ్‌సీ సిబ్బంది సూచిస్తున్నారు. డీవార్మింగ్ మాత్రలు విద్యార్థులచే చప్పరించడంతో రక్తహీనత, పోషకాహార లోపాన్ని నివారించడానికి వీలవుతుంది.

ఏం చేయాలంటే..

- భోజనానికి ఒక గంట ముందు ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది విద్యార్థులకు, తల్లిదండ్రులకు నులిపురుగులు వ్యాప్తి, నివారణ, మంచి ఆరోగ్య అలవాట్లు, ఆరోగ్య విద్యపై అవగాహన కల్పించాలి.
- చేతులు శుభ్రపర్చుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత, సమతుల ఆహారంపై వివరించాలి.
- పరిశుభ్రమైన వాతావరణంలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం తీసుకునేలా చూడాలి.
- భోజనం అనంతరం విద్యార్థులంతా డీవార్మింగ్ మాత్రలు చప్పరించేలా ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి.



విజయవంతం చేయాలి



జిల్లా అవసరాలకు తగినంత ఆల్బెండజోల్ నిల్వలు ఉన్నాయి. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించిన కార్యక్రమాన్ని విద్యా, వైద్య శాఖ సిబ్బంది విజయవంతం చేయాలి. ఇప్పటికే మాత్రలు జిల్లా కేంద్రం నుంచి పీహెచ్‌సీలకు చేరుకున్నాయి.

–డాక్టర్ జాన్‌లివి, జిల్లా కోఆర్డినేటర్, ఆర్‌బీఎస్‌కే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ

పీహెచ్‌సీలకు అందించాం..



జిల్లా కేంద్రం నుంచి అన్ని పీహెచ్‌సీలకు ఆల్బెండజోల్ మాత్రలను సరఫరా చేశాం. పీహెచ్‌సీల నుంచి పాఠశాలలకు, హాస్టల్స్, కళాశాలలకు చేరే విధంగా ఎంపీడీవోలు బాధ్యత తీసుకుంటున్నారు. విద్యా సంస్థల టార్గెట్‌కు అనుగుణంగా ఎన్ని మాత్రలు సరఫరా చేశారన్న విషయాన్ని ఈసారి ప్రత్యేకంగా యాప్‌లో నమోదు చేసి, పర్యవేక్షణ చేస్తున్నారు.

–డాక్టర్ రాజీవ్, జిల్లా కోఆర్డినేటర్, ఆర్‌బీఎస్‌కే, తూర్పుగోదావరి

మాత్రల పంపిణీకి చర్యలు

నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య ఆరోగ్యశాఖ ద్వారా 10.58 లక్షల ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలోని 5,410 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, 5,268 అంగన్‌వాడీ కేంద్రాలు, 342 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, 129 ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు (ఫస్టియర్ విద్యార్థులకు మాత్రమే), 87 ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, నర్సింగ్ కళాశాలల్లోని విద్యార్థులకు ఈ మాత్రలు అందజేయనున్నారు. 14న డీ వార్మింగ్ డేతో పాటు అన్ని పాఠశాలల్లో పరిశుభ్రతా దినం పాటించాలని ఇప్పటికే జిల్లా విద్యాశాఖ నుంచి వచ్చిన ఆదేశాలు మండల విద్యాశాఖాధికారులకు చేరుకున్నాయి. మంగళవారం అనివార్య కారణాలతో మాత్రలు తీసుకోని వారికి 18న మ్యాప్‌అప్ కార్యక్రమం నిర్వహిస్తారు.

విద్యార్థుల ఆరోగ్యం కోసం..



ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తోంది. ఈ మాత్రలను చప్పరించే విధంగా చర్యలు చేపట్టాలి. కార్యక్రమం విజయవంతానికి వైద్య ఆరోగ్య సిబ్బందికి ఉపాధ్యాయులు సహకారం అందించాలి.

–జి.నాగమణి, ఆర్జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా..


బిక్కవోలులో శ్రీలక్ష్మీగణపతి స్వామికి ఉండ్రాళ్లు సమర్పిస్తున్న పండితులు


ఆలయం వద్ద ఉండ్రాళ్లు తయారు చేస్తున్న మహిళలు

బిక్కవోలు: విఘ్నాలు తొలగించు వినాయకా అంటూ ఆ స్వామిని భక్తులు కొలిచారు. బిక్కవోలులో కొలువైన శ్రీలక్ష్మీ గణపతి ఆలయం వద్ద స్వామి వారికి లక్ష ఉండ్రాళ్లతో శనివారం నైవేద్యం సమర్పించారు. గ్రామానికి చెందిన ప్రస్తుతం విశాఖ పట్నంలో ఉంటున్న అంబటి బలరామారెడ్డి, నాగమణి దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి 250 మంది మహిళలు 11 వందల కిలోల నూకతో స్వామివారికి ఉండ్రాళ్లు తయారు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద దాతలు గణపతి హోమం జరిపారు. విశేష సంఖ్యలో భక్తులు హాజరై పూజలు చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి, శ్రీలక్ష్మీ గణపతి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తమ్మినేని నాగశ్రీనువాస్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, యామాసాని సుమన్, ఆలయం ఈఓ రామలింగ భాస్కర్ పాల్గొన్నారు.

చేనేతలంటే అంత చులకనా!

- వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు నాగ శ్రీనివాసరావు
- లోకేష్ వ్యాఖ్యలపై ఆగ్రహం


సమావేశంలో మాట్లాడుతున్న నాగ శ్రీనివాసరావు

అమలాపురం రూరల్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మదనపల్లిలో జరిగిన యువగళ పాదయాత్రలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవిని ఉద్దేశించి చులకనగా మాట్లాడటం సరికాదని వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు కాలెపు నాగ శ్రీనివాసరావు అన్నారు. శనివారం బండారులంకలో చేనేత నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరంజీవి ఆప్కో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కేవలం 35 రోజుల్లోనే రాష్ట్రం అంతా తిరిగి అన్ని చేనేత వాడల్లో సహకార సంఘాలను పరిశీలించారని అన్నారు. అధికారం, పదవులు కోల్పోయిన చంద్రబాబు, లోకేష్‌లు మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలపై తమ అక్కసు వెళ్లగక్కుతున్న చంద్రబాబు, లోకేష్‌లు చేనేతలకు ఏం చేశారో బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో నాయీ బ్రాహ్మణులను, ఎస్సీ సోదరులను కించపరిచిన చరిత్ర చంద్రబాబుదని, చేనేత పరిశ్రమనూ నిర్వీర్యం చేశారన్నారు. చేనేత, ఆప్కో, కార్మిక కుటుంబాలు చిన్నాభిన్నం కావడానికి ఆయనే కారణమని శ్రీనివాసరావు దుయ్యబట్టారు. చేనేతల సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారం దిశగా చిరంజీవి చర్యలు చేపట్టారన్నారు. సీఎం జగన్ అణగారిన వర్గాల సంక్షేమానికి పరితపిస్తున్నారన్నారు. చేనేతలకు నేతన్న నేస్తం పథకం కింద ఏటా రూ.24 వేలు ఇస్తున్నారన్నారు. చేనేత వర్గాలకు ఒక ఎంపీ స్థానం, రెండు ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించారన్నారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు


చోరీ సొత్తు, నిందితుడిని చూపుతున్న రెండో పట్టణ పోలీసులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): చోరీలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని రెండో పట్టణ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. స్థానిక రెండో పట్టణ సీఐ గణేష్ కథనం ప్రకారం.. కొంతమూరుకు చెందిన గుత్తుల లీలామహాలక్ష్మి గత నెల 14న కోటిపల్లి బస్టాండ్ వద్ద ఉండగా గుర్తు తెలియని వ్యక్తి ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలను అపహరించుకుపోయాడు. దీనిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో సీఐ గణేష్ కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం శరభవరం గ్రామానికి చెందిన సింగిడి సూరిబాబుపై నిఘా పెట్టారు. అతనిని టి.నగర్ శివాలయం వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 130 గ్రాముల బంగారం, రూ.40 వేల నగదు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు. కేసును ఛేదించిన సీఐ గణేష్, క్రైం ఎస్సై ఎస్.రాజశేఖర్, కానిస్టేబుల్స్ కె.ప్రదీప్, ఏస్.వీరబాబు, ఎస్‌కే కరీంబాషా, డి.శ్రీనివాస్, ఏవీవీ సత్యనారాయణ, బీఎస్‌కే నాయక్ బృందాన్ని జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్ రెడ్డి, డీఎస్పీ శ్రీలత అభినందించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

సామర్లకోట: డ్వామా అధికారులకు ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర అసిస్టెంట్ కమిషనర్ ఇ.కృష్ణమోహన్ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో పనిచేస్తున్న డ్వామా ఏపీడీ, ఏపీఓ, ఏసీ, టెక్నికల్ అసిస్టెంట్లకు మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన అంశాలపై అభ్యర్థుల నుంచి సమాచారం సేకరించారు. డ్వామాలో రూపొందించిన కొత్త సాఫ్ట్‌వేర్, పనుల్లో నాణ్యత, సాంకేతిక పరిజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం, చేయాల్సిన పనులపై మూడో రోజు శిక్షణ జరిగింది. మొత్తం తొమ్మిది జిల్లాల నుంచి 95 మంది హాజరయ్యారు. రిసోర్స్ పర్సన్లు బి.శ్వేత, జి.రమేష్, కె.రాజేశ్వరి, కేవీవీ సత్యనారాయణ, జేటీఎస్ సాగర్, వి.సురేష్‌కుమార్, ఎం.సత్యనారాయణ, ఎస్.నరేష్‌బాబు, ఎస్.శ్యామలలు శిక్షణ నిర్వహించారు. శిక్షణ కోఆర్డినేటర్ బండారు శ్రీనివాసు పర్యవేక్షించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు.


శిక్షణ పూర్తయిన డ్వామా అధికారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కృష్ణమోహన్ తదితరులు